
సాక్షి
నిర్మల్

మంగళవారం, 14, నవంబర్, 2023



30-50 శాతం ఓట్లతోనే అసెంబ్లీకి..!
ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందుతున్న అభ్యర్థుల్లో చాలామంది దాదాపు 30 నుంచి 50 శాతం పైచిలుకు ఓటర్ల మద్దతుతోనే అసెంబ్లీకి వెళ్తున్నారంటే ఆశ్చర్యం కలుగకమానదు. 10లో▸



రెండు సభల్లో వారి 'వాణి'
నాయకులు ఎమ్మెల్యేగానో, ఎంపీగానో ఎన్నికవ్వాలని కలలుకంటారు. ఆదిలా బాద్ ఎంపీగా 13 మంది ఎంపీలుగా ఎన్నికకాగా అందులో 8 మంది ఎమ్మెల్యేలుగానూ పనిచేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.2 / 19.5

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పరిశీలకులను నేరుగా సంప్రదించొచ్చు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఎన్నికల అంశాలకు సంబంధించి ఫిర్యాదులు, సలహాలు, సూచనల కోసం పరిశీలకులను నేరుగా సంప్రదించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. నిర్మల్, ముధోల్ నియోజకవర్గానికి సాధారణ పరిశీలకులు రవిరంజన్ కుమార్ విక్రమ్‌ను 9381423320 ఫారెస్ట్ గెస్ట్ హౌస్ నందు, ఖానాపూర్ నియోజకవర్గానికి సాధారణ పరిశీలకులు కె.గోపాలకృష్ణ పీఎంఆర్సీ గెస్ట్‌హౌస్, కేబీ కాంప్లెక్స్, ఉట్నూర్ సెల్ నెంబర్ 7386784365 నంబరులో సంప్రదించవచ్చని వివరించారు. ప్రతిరోజూ సాయంత్రం 4 నుండి 5 గంటల మధ్యన నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

జాతీయస్థాయి వుషూ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన ఎం.సాక్షి, ఆర్.సంధ్య

భైంసాటౌన్: జాతీయస్థాయి వుషూ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి వుషూ పోటీల్లో అండర్–17, 19 విభాగాల్లో ఎం.సాక్షి, ఆర్.సంధ్య ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగే 67వ జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను డీఈవో రవీందర్‌రెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల విభాగంలో 45 కేజీల విభాగంలో ఎం.సాక్షి(బాసర), 48 కేజీల విభాగంలో ఆర్.సంధ్య(కస్తూరిబా, లోకేశ్వరం) ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించగా, 56 కేజీల విభాగంలో బి.అనిత (కస్తూరిబా, లోకేశ్వరం) రజత పతకం సాధించింది. బాలుర 40 కేజీల విభాగంలో ఆర్.శ్రీనివాస్(బాసర), కాంస్యం, 45 కేజీల విభాగంలో జె.సోమేశ్(బాసర) రజత పతకాలు సాధించినట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి రమణారావు తెలిపారు.

ప్రధాని సభాస్థలి పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: భారత ప్రధాని నరేంద్రమోదీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 26న నిర్మల్ వస్తున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్ల కోసం కలెక్టరేట్ వెళ్లే దారిలో ఉన్న మైదానాన్ని నిర్మల్ బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్ సోమవారం పరిశీలించారు. వారివెంట నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, ఒడిసెల అర్జున్, కుమ్మరి వెంకటేశ్, భూపతిరెడ్డి, సరికెల గంగన్న ఉన్నారు.

ప్రతీ అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు జరిగేలా రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, ఎస్ఎస్‌టీ టీం ప్రతీ అంశాన్ని పరిగణలోనికి తీసుకోవాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రచారంలో భాగంగా ఎన్నికల నియమావళిననుసరిస్తూ అనుమతులతో కూడిన ప్రచార సామగ్రి, పంపిణీ చేసే కరపత్రాలతో ప్రచారం నిర్వహించాలన్నారు. ఎన్ని కల ప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార సమావేశాలను ఫీల్డ్ లెవల్ సర్వైలేన్స్ అధికారులు ఖర్చును అంచనా వేసేందుకు ప్రతి అంశాన్ని వీడియో తీసి రికార్డు చేసి భద్రపరచాలన్నారు. నిర్మల్ మునిసిపాలిటీ పరిధిలో పోస్టర్లు, బ్యానర్లు, బెలూన్లు, గుర్తులు అనుమతులు లేని వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చెక్ పోస్టుల ద్వారా పటిష్టమైన బందోబస్తు, నిఘా, ముమ్మర తనిఖీలు, అక్రమంగా తరలించే మద్యం నగదుపై పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

అంతా.. సర్వేంతర్యామి!

- ఆరా తీస్తున్న సర్వే బృందాలు
- చాటుమాటుగా ఓటరు అభిప్రాయ సేకరణ
- పక్క ప్రాంతాల నుంచి వచ్చి..
- చాయ్ హోటళ్లు, గల్లీ అడ్డాల వద్ద..
- ప్రముఖుల నుంచి సమాచార సేకరణ



నిర్మల్: 'నమస్తే అన్న.. అంత మంచిదేనా..! ఎట్లున్నయే మీ దగ్గర ఎలక్షన్లు..? మీ ఊళ్లే పెద్ద లీడర్లు ఓళ్లున్నరే మరి..? ఇంతకు ఏ పార్టీ గెలుస్తుందంటవే..? నువ్వయితే ఓళ్లు గెలువాలనుకుంటున్నవన్న...?' ఇలా ముక్కూమొహం తెలియనివాళ్లు చాయ్ హోటళ్ల దగ్గర, ఊళ్లే రచ్చబండల దగ్గర వచ్చి కూర్చుని ఆరా తీస్తున్నారు. స్థానికంగా ఉన్న రాజకీయ సరళిని తమ ప్రశ్నల ద్వారా రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ పార్టీల విజయావకాశాలపై సర్వే చేసేందుకు జిల్లాలో బృందాలుగా తిరుగుతున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన బృందాలు సర్వే చేస్తున్నాయి. చాయ్ హోటళ్లు, అడ్డాలు, జనాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలతోపాటు రాజకీయంగా అవగాహన ఉన్న వివిధవర్గాల వారి వద్దకు వెళ్లి వివరాలను రాబడుతున్నారు. అభ్యర్థులు ప్రచారం చేసిన గ్రామాల్లోకి వెళ్లి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు.

అంతటా అదే ముచ్చట..
ఎన్నికలు అనగానే సాధారణంగా ఏ పార్టీ గెలుస్తుంది.. ఏ అభ్యర్థిని విజయం వరిస్తుంది.. అనే అంశాలు ఆసక్తి రేపుతుంటాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎన్నికలపైనే చర్చ నడుస్తూ ఉంటుంది. ఏ నలుగురు కలిసినా రాజకీయాలపైనే గంటలపాటు ముచ్చట్లు కొనసాగుతున్నాయి. ఇంట్లో వాళ్లతో, బయట మిత్రులతో, ఆఫీస్‌లో తోటి ఉద్యోగులతో, ఫంక్షన్లలో బంధుమిత్రులతో.. ఇలా ఎక్కడైనా ఎన్నికలపైనే చర్చ నడుస్తోంది. చాలా సందర్భాల్లో హాట్ టాపిక్‌గా మారుతోంది. ఇక కొంతమంది వీరాభిమానులు ఎదుటివారు తమ పార్టీపైన విమర్శలు చేస్తే.. గొడవలకు దిగుతున్న సందర్భాలూ ఉన్నాయి.

నిర్మల్‌పైనే దృష్టి..
ప్రధానంగా జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పోలిస్తే నిర్మల్‌పైనే సర్వే సంస్థలు ఫోకస్ చేశాయి. జిల్లాకేంద్రంతోపాటు ముందు నుంచీ రాజకీయ కేంద్రంగానూ నిర్మల్‌కు పేరుంది. ఇక్కడ గల్లీ నుంచి ఢిల్లీదాకా ఎదిగిన నేతలున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ను తమ గుప్పిట్లో పెట్టుకుని రాజకీయాలు నడిపించిన చాణక్యతనూ చాటారు. ఇక ఇక్కడి ఓటర్లకు విలక్షణమైన తీర్పులను ఇస్తారన్న పేరూ ఉంది. ఈనేపథ్యంతోపాటు ఈసారి మూడు ప్రధాన పార్టీల నుంచి ముగ్గురూ బలమైన అభ్యర్థులు ఉన్నారు. ఈసారి ఎన్నికలు త్రిముఖ పోరును తలపించనున్నాయి. రాష్ట్రంలోనే నిర్మల్ నియోజకవర్గం హాట్‌టాపిక్‌గా మారింది. ఈనేపథ్యంలో సర్వే సంస్థలు నిర్మల్‌లో పకడ్బందీగా ఓటర్ సర్వే చేయిస్తున్నట్లు తెలిసింది. ముధోల్, ఖానాపూర్‌లోనూ సర్వేలు కొనసాగుతున్నాయి.

పార్టీలూ చేయిస్తున్నాయి..
పలు సర్వే సంస్థలతో ప్రధాన పార్టీలు కూడా తమదైన సర్వేలను చేయిస్తున్నాయి. జిల్లాలో తమ పార్టీ పరిస్థితి, అభ్యర్థి పాపులారిటీని ఎప్పటికప్పుడు జనాల నుంచి రాబట్టుకుంటున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా బృందాలను రంగంలోకి దించాయి. తమ పార్టీ బలం ఎలా ఉందో తెలుసుకోవడంతోపాటు ఎదుటి పార్టీ ప్రచారం తీరు, వారి బలాబలాలనూ అంచనా వేసేందుకు సర్వే ఫలితా లను ఉపయోగించుకుంటున్నాయి. గతంలోనూ ఇలాంటి సర్వేలను పార్టీలు చేయించుకున్నాయి. సర్వేలలో వెల్లడైన లోపాలను సరిదిద్దుకుంటూ విజయం కోసం వ్యూహా లకు పదును పెడుతున్నాయి.

ఆరా తీస్తూ.. చేరవేస్తూ..
ప్రజల ఆసక్తిని పట్టుకోవడానికి, అదే సమయంలో స్థానిక ఎన్నికల తీరును తెలుసుకోవడానికి పలు సంస్థలు సర్వేలు చేపడుతుంటాయి. ప్రజల నాడీని ఎన్నికలకు ముందే తెలుసుకుని ఎగ్జిట్ పోల్స్ రూపంలో అప్పటికప్పుడు ఉన్నటువంటి పరిస్థితులపైన ఫలితాలను వెలువరుస్తుంటాయి. ప్రస్తుత ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే పలు సంస్థలు సర్వే ఫలితాలను వెలువరించాయి. ఎగ్జిట్‌పోల్స్‌ను వెల్లడించేందుకు మరికొంత సమయం ఉండటంతో జిల్లాలో ఇంకా సర్వే చేస్తూనే ఉన్నారు. జిల్లాలోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ మూడు నియోజకవర్గాల్లోనూ స్థానిక పరిస్థితులపైన ఆరా తీస్తున్నారు. ఎప్పటికప్పుడూ తమ సంస్థలకు ఆన్‌లైన్‌లో చేరవేస్తున్నారు.

దీపావళి సంబరాల్లో మంత్రి



టపాసులు కాల్చుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: దీపావళి పండుగను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్నారు. ఇంట్లో లక్ష్మీదేవి పూజ చేశారు. అనంతరం టపాసులు కాల్చారు. చీకట్లను చెరిపేసే ఈ పండుగ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

'కుటుంబ సంక్షేమ నిధి'లో ఉపాధ్యాయుల చేరిక



ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందజేస్తున్న సంఘ నాయకులు

నిర్మల్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్)జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కేజీబీ వీలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్ర మం నిర్వహించారు. ఉపాధ్యాయులు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే కుటుంబ సంక్షేమ నిధి పథకంలో చేరారు. ఈ సంక్షేమ నిధిలో చేరిన ఉపాధ్యాయులకు రూ.6 లక్షల ఇ న్సూరెన్స్ ఉంటుందని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ పేర్కొన్నా రు. ఇందులో సంఘ కోశాధికారి కురుమే నాగ య్య, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11 నామినేషన్లు తిరస్కరణ

- ముగిసిన నామినేషన్ల స్క్రూటినీ
- వివిధ కారణాలతో తొలగింపు
- ప్రధాన అభ్యర్థులంతా బరిలోనే..
- 15 వరకు విత్‌డ్రాకు అవకాశం..

నిర్మల్: జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ సోమవారం ముగిసింది. ఇందులో అధికారులు 11మంది నామినేషన్లను తిరస్కరించినట్లు ప్రకటించారు. వివిధ కారణాలతో వారిని రిజెక్ట్ చేసినట్లు వివరించారు. ప్రధాన పార్టీల ప్రధాన అభ్యర్థులెవరూ తిరస్కరణకు గురికాలేదు. వారి తరఫున సబ్‌స్టిట్యూట్‌గా వేసిన వారివి రిజెక్ట్ చేశారు. స్క్రూటినీ తర్వాత ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్రులు కలిపి జిల్లాలో మొత్తం 47 మంది అభ్యర్థులు మిగిలారు. వీరిలోనూ ఎవరైనా పోటీ నుంచి తప్పుకోవాలనుకుంటే ఈనెల 15వరకు గడువు ఉంది. లేనిపక్షంలో అదేరోజు సాయంత్రం స్వతంత్రులకు గుర్తులను కేటాయించి, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను ఫైనల్‌గా ప్రకటిస్తారు.

వివిధ కారణాలతో..
నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో కలిపి ఈనెల 10న నామినేషన్ల దాఖలు చివరి రోజు వరకు మొత్తం 80 మంది అభ్యర్థులు అన్నిసెట్లు కలిపి 100 నామినేషన్లు వేశారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం వీటిని అధికారులు స్క్రూటినీ చేశారు. ఇందులో 11 మందికి సంబంధించిన నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ప్రకటించారు. జాతీయ, రాష్ట్ర పార్టీలు అయినప్పటికీ ఏ, బీ ఫామ్‌లు లేని అందని అభ్యర్థులను పక్కనపెట్టారు. అలాగే అఫిడవిట్లలో సరైన సమాచారం అందించని వారిని తొలగించారు. అభ్యర్థిత్వాన్ని బలపర్చడానికి సరి పడా వ్యక్తులను చూపెట్టని వారి నామినేషన్లనూ రిజెక్ట్ చేశారు. ఈ కారణాలతో 11 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, ఇంకా 47మంది అభ్యర్థులు మిగిలారు.

నిర్మల్‌లో..
నిర్మల్ నియోజకవర్గానికి సంబంధించి నలుగురు అభ్యర్థులకు సంబంధించి ఏడు నామినేషన్ల పత్రాలు తిరస్కరణకు గురయ్యాయి.
సయ్యద్ హైదర్ : ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) నుంచి నామినేషన్‌ను దాఖలు చేశారు. కానీ పార్టీకి సంబంధించి సకాలంలో ఏ, బీఫాంలను సమర్పించలేదు. అలాగే తనను బలపర్చడానికి ఒకరు మాత్రమే వచ్చారు.
కూచాడి మాధురి : నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు కుమార్తె. కాంగ్రెస్ అభ్యర్థి సబ్‌స్టిట్యూట్‌గా నామినేషన్ వేశారు. కానీ పార్టీ నుంచి ఏ, బీఫాం అందించలేదు. ఆమె నామినేషన్‌ను ఒకరే బలపర్చారు. కాంగ్రెస్ ప్రధాన అభ్యర్థిగా శ్రీహరిరావును గుర్తించారు.
మర్రిపెద్ది బాలరాజు: స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. తనను బలపర్చాల్సిన తొమ్మిదిమంది ప్రతిపాదకుల సంతకాలు లేకపోవడంతో తిరస్కరించారు.
పృథ్వీరాజ్‌వర్మ: స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఫామ్–26 అఫిడవిట్‌లో సంతకా లు చేయకపోవడం, సంబంధిత కాలమ్‌లను ఖాళీగా ఉంచారు. దీనిపై నోటీసు ఇచ్చినా రివైజ్డ్ అఫిడవిట్ అందించకపోవడంతో రిజెక్ట్ చేశారు.

15 వరకు ఉపసంహరణ..
మూడు నియోజకవర్గాలకు సంబంధించిన మిగిలిన 47 మందిలోనూ ఎవరైనా పోటీ నుంచి తప్పుకోవాలనుకుంటే ఈనెల 15 వరకు గడువు ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 15 వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. లేనిపక్షంలో అదేరోజు సాయంత్రం వరకు స్వతంత్రులకు గుర్తులను కేటాయిస్తారు. అప్పటి వరకు మిగిలిన అభ్యర్థులతో ఫైనల్ జాబితాను ప్రకటించి, ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తారు.

ముధోల్‌లో..
ముధోల్ నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురి నామినేషన్లను తిరస్కరించారు.
అఖిలేశ్ భోస్లే : కాంగ్రెస్ అభ్యర్థి భోస్లే నారాయణరావు కుమారుడు. తండ్రి తరపున సబ్‌స్టిట్యూట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. నారాయణరావుపటేల్‌ను ప్రధాన అభ్యర్థిగా గుర్తించడంతో అఖిలేశ్ నామినేషన్లను తిరస్కరించినట్లు ప్రకటించారు.
కె.సూర్యనారాయణ : ఆమ్‌ఆద్మీ పార్టీ ముధోల్ అభ్యర్థిగా కాలేవార్ సూర్యనారాయణ నామినేషన్ వేశారు. పార్టీ నుంచి ఏ, బీఫాం ఇవ్వలేదు. ఈ కారణంతో తిరస్కరించారు.
భూపతిరెడ్డి సింగారెడ్డి : అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ నుంచి నామినేషన్ వేశారు. సదరు పార్టీ రిజిస్టర్డ్ గుర్తింపు లేదు. స్వతంత్ర అభ్యర్థిగా కొనసాగాలంటే కనీసం పదిమంది ప్రతిపాదకులైన ఉండాలి. కానీ ఒకరే ప్రతిపాదకులు ఉండటంతో ఆయన నామినేషన్ తిరస్కరించారు.

ఖానాపూర్‌లో..
మూడు జిల్లాల్లో భాగమైన ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన ఖానాపూర్‌లో నలుగురి నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు అధికారులు ప్రకటించారు.
రితేశ్ రాథోడ్ : బీజేపీ ప్రధాన అభ్యర్థి రమేశ్ రాథోడ్ కుమారుడు. ఈయన కూడా బీజేపీ నుంచే నామినేషన్ దాఖలు చేశారు. కానీ ఆ పార్టీ నుంచి ఏ, బీఫామ్‌లను అందించకపోవడంతో రిజెక్ట్ చేశారు.
కళ్యాణి రాథోడ్ : బీఎస్పీ ప్రధాన అభ్యర్థి బన్సీలాల్ రాథోడ్ భార్య. ఆయనకు సబ్‌స్టిట్యూట్‌గా ఆమె బీఎస్పీ నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నుంచి ప్రధాన అభ్యర్థిగా బన్సీలాల్ రాథోడ్ ఉండటంతో ఆమె నామినేషన్‌ను రిజెక్ట్ చేశారు.
గంగాధర్ గుగ్లావత్ : భారత్ చైతన్య యువజన పార్టీ(బీసీవైపీ) నుంచి నామినేషన్ వేశారు. అఫిడవిట్ పత్రాల్లో సంతకాలు చేయలేదు. అధికారులు నోటీసు ఇచ్చినా సకాలంలో స్పందించకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరించారు.
ఆత్రం భీమ్‌రావు: ఖానాపూర్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. సరిపడా ప్రతిపాదకులు లేకుండా అలాగే అఫిడవిట్ పూర్తి చేయకుండా నామినేషన్ సమర్పించారు. దీనిపై అధికారులు నోటీసు చేసినా స్పందించకపోవడంతో ఆయన నామినేషన్‌ను రిజెక్ట్ చేశారు.

చుట్టేస్తారా..

- ప్రచారానికి మిగిలింది 14 రోజులే
- ఉమ్మడి జిల్లాలో పూర్తికాని ముఖ్యనేతల పర్యటన
- 26న నిర్మల్‌కు మోదీ..
- త్వరలో మందమర్రికి రాహుల్‌గాంధీ, ఆదిలాబాద్‌కు 'యోగి'



ప్రధాని మోదీ

సాక్షి, ఆదిలాబాద్: ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణతోపాటు పరిశీలన ప్రక్రియ కూడా ముగిసింది. ప్రస్తుతం ప్రచార పర్వం మంచి ఊపులో ఉంది. ప్రచారానికి ఇంకా 14 రోజుల సమయమే ఉంది. జాతీయ, రాష్ట్ర నేతలు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. ఇంకా పలు చోట్ల పర్యటించాల్సి ఉంది.

మోదీ, రాహుల్ రాక..
బీజేపీకి సంబంధించి ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభ జరగగా, ఈ నెల 26న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్మల్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనపై బీజేపీ అభ్యర్థులు భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇక ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ త్వరలో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక కాంగ్రెస్ ప్రచారానికి సంబంధించి ఉమ్మడి జిల్లాకు రాహుల్ గాంధీ రానున్నట్లు హస్తం నేతలు చెబుతున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రిలో త్వరలో సభ నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.

ఆ రెండు నియోజకవర్గాలను టచ్ చేయలేదు..
ముఖ్య నేతల పర్యటనలకు సంబంధించి ఇప్పటివరకు పలు నియోజకవర్గాల్లో ఏదైనా పార్టీ నుంచి బహిరంగ సభలు నిర్వహించినప్పటికీ మంచిర్యాల, బోథ్ నియోజకవర్గాల్లో ఇటు జాతీయ, అటు రాష్ట్ర నేతలెవరు ఎన్నికల షెడ్యూల్ జారీ అయిన తర్వాత రాకపోవడం గమనార్హం. ఈ రెండు నియోజకవర్గాల్లో త్వరలో సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ అసంపూర్తేనా..
బీఆర్ఎస్ టచ్ చేయని నియోజకవర్గాలు మంచిర్యాల, బోథ్ ఉండగా, కాంగ్రెస్ టచ్ చేయనివి చెన్నూర్, మంచిర్యాల, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, సిర్పూర్, బోథ్ ఉన్నాయి. బీజేపీ టచ్ చేయని నియోజకవర్గాలు చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, భైంసా, బోథ్ ఉన్నాయి.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి



ప్రచారంలో భాగంగా మంత్రి ఐకేరెడ్డికి గాజులపేట్‌లో హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- నిర్మల్ పట్టణంలో ఎన్నికల ప్రచారం

నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందని బీఆర్ఎస్ నిర్మల్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజా, రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఆది, సోమవారాల్లో జిల్లా కేంద్రంలోని నాగరేశ్వరవాడ, కస్బా, ఇందిరానగర్, బాగులవాడ, బస్‌డిపో బోయవాడ, గాజుల్‌పేట్, ప్రియదర్శిని నగర్, న్యూబస్టాండ్, కూరన్నపేట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వృద్ధులను ఆప్యాయంగా పలుకరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. మహిళలు హారతులు ఇస్తూ... బొట్టుపెట్టి తమ కాలనీకి ఆహ్వానించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ఉన్న హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కేసీఆర్ భరోసా పేరుతో రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం వైఎస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన గుస్సాడీ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాకాల రాంచందర్, భూషణ్‌రెడ్డి, అప్పాల మహేష్, ప్రభాకర్, అల్లోల తిరుపతిరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, కౌన్సిలర్ ఇమ్రాన్ ఉల్లా, యువ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మాదిగ సంక్షేమ సంఘం మద్దతు
నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికే తమ సంపూర్ణ మద్దతు అని 20వ వార్డు గాజులపేట్ మాదిగ సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. అట్టడుగువర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తూ, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డికి మద్దత తెలుపుతూ తీర్మానం కాపీ అందించారు.

బీజేపీ గెలిస్తే నిరుపేదలందరికీ ఇళ్లు



వంజర్ గ్రామంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

- కబ్జాల మంత్రిని ఓడించడానికి ప్రజలంతా సిద్ధం కావాలి
- బీజేపీ నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: బీజేపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని బీజేపీ నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని స్వర్ణ, జౌళి, నారాయణపల్లి, మలక్‌చించోలి, వంజర్, కంకెట, వైకుంఠాపూర్, తాండ్ర(జి), ప్యారమూర్, బీరవెల్లి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్లుగా నిర్మల్‌లో అధికారంలో ఉన్న మంత్రి ఇప్పటి వరకు నిరుపేదలకోసం చేసిందేమీ లేదని అన్నారు. కేవలం ఆస్తులు కూడబెట్టుకోవడానికి, అనుచరులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి మాత్రమే పనిచేశారని అన్నారు. ఎక్కడపడితే అక్కడ గజం భూమి లేకుండా నిర్మల్ చుట్టూ భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీజేపీని ఎదుర్కొనే సత్తాలేకనే తమ పార్టీ నుంచి ఓనాయకుడిని కాంగ్రెస్‌లోకి పంపించి పోటీ చేయిస్తున్నారని అన్నారు. ఈవిషయం ప్రభుత్వ చీఫ్ విప్ బాల్కసుమన్ వెల్లడించారని అన్నారు. నిర్మల్‌లో తనను గెలిపిస్తే పీఎం మోదీతో మాట్లాడి నిర్మల్‌ను అభివృద్ధి చేసి కబ్జాకోరల్లో చిక్కుకున్న భూములను విడిపించి పేదలకు పంచుతామని అన్నారు. కనుక ప్రజలు ఈసారి ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా మండలంలోని వంజర్, మలక్‌చించోలి, బీరవెల్లి, నారాయణపల్లి, జౌళి గ్రామాలకు చెందిన దాదాపు వందమంది మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. గంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాంరెడ్డి, మధు, వీరయ్య, శ్రావణ్‌కుమార్, చందు, రాజేశ్వర్, చెన్నురాజేశ్వర్, విలాస్, రావుల రాంనాథ్, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

30-50 శాతం ఓట్లతోనే అసెంబ్లీకి..!

భైంసాటౌన్: ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందుతున్న అభ్యర్థుల్లో చాలామంది దాదాపు 30 నుంచి 50 శాతం పైచిలుకు ఓటర్ల మద్దతుతోనే అసెంబ్లీకి వెళ్తున్నారంటే ఆశ్చర్యం కలుగకమానదు. సాధారణంగా ఆయా నియోజకవర్గాల్లో ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు బరిలో ఉంటారు. వారి మధ్యే పోటీ ఎక్కువ ఉంటుంది. మొత్తం ఓట్లలో 70 నుంచి 80 శాతమే పోలింగ్ నమోదవుతుంది. అందులోనూ 30–50 శాతం ఓట్లు పొందినవారే విజేతలుగా నిలుస్తున్నారు. నియోజకవర్గాల్లో తక్కువ మంది ఓటర్ల మద్దతుతోనే అసెంబ్లీకి వెళ్తున్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్ నియోజకవర్గంలో 1957 నుంచి 2018 అసెంబ్లీ ఎన్నికలు పరిశీలిస్తే..పోలైన ఓట్లలో 30 నుంచి 57 శాతం ఓట్లతోనే ఎమ్మెల్యేలుగా గెలిచిన వారున్నారు.1962లో పి.నర్సారెడ్డి అత్యధికంగా 70.84 శాతం ఓట్లు సాధించగా, 2004లో అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి 57.38 శాతం ఓట్లు పొందారు. 2009లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి 33.71 శాతం ఓట్లతో గెలిచారు.

ముథోల్‌లో..

ముథోల్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 14 సార్లు ఎన్నికలు జరుగగా, ఆయా ఎన్నికల్లో పోలైన ఓట్లలో గెలుపొందిన అభ్యర్థులకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే..1967లో గడ్డిగారి గడ్డెన్న అత్యధికంగా 71.48 శాతం ఓట్లు, 2004లో భోస్లే నారాయణ్ రావు పటేల్ 60.73 శాతం ఓట్లు సాధించగా, 2009 ఎన్నికల్లో ఎస్.వేణుగోపాలాచారి 32 శాతం , 2014లో విఠల్‌రెడ్డి 38.49 శాతం ఓట్లు సాధించారు.



ఖానాపూర్‌లో..

ఖానాపూర్ నియోజకవర్గంలో 1978 నుంచి ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు వచ్చిన ఓట్ల శాతం పరిశీలిస్తే.. 1994లో అజ్మీరా గోవింద్ నాయక్ 63.76 శాతం ఓట్లు పొందగా, 1999లో రాథోడ్ రమేశ్ 52.70 శాతం ఓట్లతో గెలిచారు. 1978లో అంబాజీ 34 శాతం ఓట్లు సాధించారు.

నిర్మల్ నియోజకవర్గం..

ఏడాది	మొత్తం ఓట్లు	పోలైనవి	విజేత	ఓట్లు	శాతం
1957	56,937	23,032	ముత్యంరెడ్డి	9,493	41.21
1962	61,966	31,261	నర్సారెడ్డి	22,147	70.84
1967	71,532	45,486	పీఎన్‌రెడ్డి	24,595	54.00
1972			పి.నర్సారెడ్డి ఏకగ్రీవం		
1978	86,064	65,499	గంగారెడ్డి	24,021	36.67
1983	98,807	70,004	భీమారెడ్డి	39,364	56.23
1985	1,07,955	75,303	వేణుగోపాలాచారి	39,466	52.40
1989	1,33,954	98,064	వేణుగోపాలచారి	46,807	47.73
1994	1,41,040	1,04,013	వేణుగోపాలాచారి	58,526	56.26
1999	1,65,299	1,16,427	ఇంద్రకరణ్‌రెడ్డి	62,523	53.70
2004	1,67,152	1,22,415	ఇంద్రకరణ్‌రెడ్డి	70,249	57.38
2009	1,69,124	1,31,263	మహేశ్వర్‌రెడ్డి	44,261	33.71
2014	2,10,094	1,61,609	ఇంద్రకరణ్‌రెడ్డి	61,368	37.97
2018	2,16,777	1,71,664	ఇంద్రకరణ్‌రెడ్డి	79,985	46.59

ముథోల్ నియోజకవర్గం..

ఏడాది	మొత్తం ఓట్లు	పోలైనవి	విజేత	ఓట్లు	శాతం
1957	53,659	24,446	జి. గంగారెడ్డి	12,674	51.84
1962	57,309	29,016	జి.గంగారెడ్డి	13,080	45.07
1967	72,325	48,413	గడ్డెన్న	34,610	71.48
1972			ఏకగ్రీవం(గడ్డెన్న)		
1978	92,616	65,681	గడ్డెన్న	33,490	50.98
1983	1,02,536	71,277	గడ్డెన్న	37,679	52.86
1985	1,10,291	77,404	హన్మంత్‌రెడ్డి	44,438	57.41
1989	1,21,909	96,494	గడ్డెన్న	43,360	44.93
1994	1,41,110	1,11,071	నారాయణ్‌రావుపటేల్	64,925	58.45
1999	1,62,375	1,21,801	గడ్డెన్న	57,193	46.95
2004	1,67,544	1,28,712	నారాయణ్‌రావుపటేల్	78,175	60.73
2009	1,75,817	1,37,548	వేణుగోపాలాచారి	45,019	32.72
2014	2,08,805	1,64,510	విఠల్‌రెడ్డి	63,322	38.49
2018	2,16,784	1,82,535	విఠల్‌రెడ్డి	83,703	45.85

ఖానాపూర్ నియోజకవర్గం..

ఏడాది	మొత్తంఓట్లు	పోలైనవి	విజేత	ఓట్లు	శాతం
1978	73,908	47,340	అంబాజీ	16,182	34.18
1983	86,723	48,739	అంబాజీ	17,269	35.43
1985	90,073	52,207	గోవింద్‌నాయక్	22,014	42.16
1989	1,16,876	74,262	భీంరావు	34,125	45.95
1994	1,25,857	88,447	గోవింద్‌నాయక్	56,400	63.76
1999	1,40,489	96,565	రాథోడ్ రమేశ్	50,892	52.70
2004	1,49,525	1,07,305	గోవింద్‌నాయక్	50,763	47.30
2009	1,56,471	1,16,513	సుమన్ రాథోడ్	56,014	48.00
2014	1,86,490	1,37,609	రేఖానాయక్	67,442	49.00
2018	1,87,893	1,57,338	రేఖానాయక్	67,138	44.36

క్లుప్తంగా

కేక్ ఖావో.. ఓట్ దాలో..!



'పహ్లే కేక్ ఖావో.. బాద్ మే కార్‌కో ఓట్ దాలో..'అన్నట్లుగా సోమవారం నిర్మల్‌లోని గాజుల్‌పేట్‌లో నిర్వహించిన ప్రచారంలో మంత్రి, నిర్మల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి ఇలా ఒకరికి కేక్ తినిపించారు.
- నిర్మల్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయాలైన రావోజీ

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. కనకాపూర్ గ్రామానికి చెందిన కరిపె రావోజీ (42) జాతీయ రహదారి పక్కన హోటల్‌లో టీ తాగాక బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఓరుసు వెంకటేశ్వర్లు (19) అజాగ్రత్తగా కారు నడుపుతూ వేగంగా నిర్మల్ నుంచి ఖానాపూర్ వైపు వస్తుండగా బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన రావోజీని స్థానికులు నిర్మల్ ఏరియా ఆసుపత్రికి పంపించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రావోజీ భార్య సాయవ్వ ఫిర్యాదుతో వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రెండు సభల్లో వారి 'వాణి'







జంగ్ తెలంగాణ

- ఎంపీ, ఎమ్మెల్యేలుగా రాణించిన పలువురు నేతలు
- రాజకీయంగా తమకంటూ ప్రత్యేక గుర్తింపు

రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాయకుల్లో చాలామంది ఎమ్మెల్యేగానో, ఎంపీగానో ఎన్నికవ్వాలని కలలుకంటారు. వాటిని నిజం చేసుకునేందుకు ఎంతో శ్రమిస్తారు. అనుకున్న లక్ష్యాన్ని చేరాలనే ఉద్దేశంతో రాజకీయ పార్టీల్లో చేరి నియోజకవర్గ టికెట్లను దక్కించుకున్నా ప్రజల్లో పలుకుబడిని సంపాదించుకున్నా చట్టసభల్లోకి అడుగిడే అదృష్టం మాత్రం అందరికీ దక్కదు. అలాంటిది కొంతమంది నాయకులు జిల్లాస్థాయి పదవులను చేపట్టడమే కాకుండా అసెంబ్లీ, పార్లమెంట్ వంటి చట్టసభల్లో అడుగిడి తమకంటూ ప్రత్యేక గుర్తింపును చాటుకున్నారు. ఇప్పటి వరకు ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి 13 మంది ఎంపీలుగా ఎన్నికకాగా అందులో 8 మంది ఎమ్మెల్యేలుగా రాణించడం గమనార్హం. పార్లమెంట్, అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పార్టీల పరంగా తమవాణి వినిపిస్తున్న కొంతమంది నాయకులు మరోసారి ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నికైన నాయకుల తీరును పరిశీలిస్తే....

– కైలాస్‌నగర్

సి.మాధవరెడ్డి



కమ్యూనిస్టుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన మాధవరెడ్డి టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పదవులను దక్కించుకున్నారు. ఆయన రాజకీయ జీవితం మూడు పార్టీల్లో సాగింది. 1952లో జరిగిన తొలి పార్లమెంట్ ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి 1962లో బోథ్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. టీడీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి రెండో సారి ఎంపీగా విజయం సాధించారు.

పి.నర్సారెడ్డి



స్వాతంత్ర్య సమరయోధుడిగా హైదరాబాద్ నిజాం పాలన నుంచి విముక్తి కోసం ఉద్యమించిన పి.నర్సారెడ్డి ఎంపీగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా సేవలందించి రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున నిర్మల్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇరిగేషన్, రెవెన్యూ, శాసనసభ వ్యవహారాల శాఖ క్యాబినేట్ మంత్రిగా సేవలందించారు. ఒకసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన 1989లో అదే పార్టీ తరఫున పార్లమెంట్‌లోకి అడుగు పెట్టారు.

పి.గంగారెడ్డి



నిజామాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొద్దుటూరి గంగారెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా 1964నుంచి 1967వరకు పనిచేశారు. 1967, 1971లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసి రెండుసార్లు విజయం సాధించారు. ఆ తర్వాత 1978లో నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ఎస్.వేణుగోపాలాచారి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు దశాబ్దాల పాటు ఓ వెలుగు వెలిగిన నాయకుడు సముద్రాల వేణుగోపాలాచారి. టీడీపీ ఆవిర్భావంతో రాజకీయాల్లో అడుగుపెట్టిన ఆయన 1985, 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1996, 1998, 1999 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్‌తో రికార్డు సృష్టించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగానూ సేవలందించారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన రాష్ట్ర క్యాడ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

రాథోడ్ రమేశ్



ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన తొలి గిరిజన నాయకుడు రాథోడ్ రమేశ్. 1999లో టీడీపీ తరఫున ఖానాపూర్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో జరిగిన ఎన్నికల్లో అదే పార్టీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2006లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నార్నూర్ జెడ్పీటీసీగా ఎన్నికై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. 2009లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్టీ రిజర్వ్‌డ్ కావడంతో ఎంపీగా పోటీచేసి పార్లమెంట్‌లోనూ అడుగుపెట్టారు.

సోయం బాపూరావు



వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడైన సోయం బాపూరావు 2003లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరారు. 2004లో బోథ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో టీడీపీ తరఫున పోటీచేసి ఓటమిపాలయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2018లో అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. మరుసటి ఏడాది బీజేపీలో చేరిన ఆయన 2019లో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. బీజేపీ నుంచి గెలిచిన తొలి ఎంపీగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం బోథ్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు.

గోడం నగేశ్



తన తండ్రి గోడం రామారావు స్ఫూర్తితో ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన గోడం నగేశ్ 1994లో టీడీపీ నుంచి పోటీచేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1999, 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన గిరిజన సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రిగా, గిరిజన సహకార సంస్థ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గానూ పనిచేశారు. 2014 పార్లమెంట్ ఎన్నికల సమయంలో టీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన ఆ పార్టీ ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు.

అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



1991లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత 1999, 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 2008లో జరిగిన ఉప ఎన్నికలో మరోసారి అదేపార్టీ తరఫున ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. 2014లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరి దేవాదాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2018లో టీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది మరోసారి అటవీశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా మరోసారి అసెంబ్లీ బరిలో నిలిచిన ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఘనంగా గోవర్ధన పూజలు



నార్నూర్: దీపావళి మరుసటిరోజు ఆదివాసీ గిరిజనులు గోవర్ధన పూజ చేస్తుంటారు. మాన్యాపూర్ సమీపంలోని గోవర్ధనగుట్ట వద్ద గోవులకు గ్రామపటేల్ మేస్రం రూప్‌దేవ్ ఆధ్వర్యంలో సోమవారం పూజలు చేశారు. గుస్సాడీలకు సంప్రదాయ ప్రకారం నమస్కరించారు. పశువులను ఒకచోట తీసుకువచ్చి నైవేద్యం తినిపించారు. ఇలా చేస్తే అందరూ సుఖసంతోషాలతో ఉంటారని వారి నమ్మకం. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసంబ నాగోరావు, ఉప సర్పంచ్ రూప్‌దేవ్, గ్రామపెద్దలు నా నాజీ, బాదిరావు, యెత్మారావు, నాగో రావు, సుంగు, సూర్యరావు ఉన్నారు.

దండారీ ఉత్సవాలు



ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో దండారీ ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మాన్కుగూడకు చెందిన గుస్సాడీ బృందం.. సర్పంచ్ అడవ్ మారుతి ఇంటి ఎదుట నృత్యాలు చేశారు. గ్రామ పటేల్ భీంరావు ఉన్నారు.

ఆదివాసీ కళాకారుల నృత్య ప్రదర్శన



ఇచ్చోడ: కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో సోమవారం నిర్వహించిన జానపద జాతరలో మండలంలోని దూబార్‌పేట్‌కు చెందిన ఆదివాసీ సకల కళాసంక్షేమ సంఘం కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్ గోపాలకృష్ణ వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఆదివాసీ కళాసంఘం డైరెక్టర్ కాత్లె శ్రీధర్ ఉన్నారు.

చప్రాలలో ఉద్రిక్తత

- ప్రచారంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బాహాబాహీ
- సముదాయించిన పోలీసులు

బేల: మండలంలోని చప్రాల గ్రామంలో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ కోట్ల రూపాయలు అక్రమంగా దోచుకున్నారని ఆరోపించారు. వ్యక్తిగతంగా దూషించడంతో మనోహర్ అనుచరులు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఆయన ప్రసంగాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు బాహాబాహీకి దిగారు. ఎస్సై రాధిక, పోలీసులు రంగప్రవేశం చేసి బీఆర్‌ఎస్ శ్రేణులను సముదాయించారు. మరో వైపు జైనథ్ సీఐ కోల నరేశ్‌కుమార్ కాంగ్రెస్ శ్రేణులను నిలువరించారు. చాలాసేపటి తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. పార్టీల నాయకులు పరస్పరం బేల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.



బీఆర్‌ఎస్ శ్రేణులను సముదాయిస్తున్న ఎస్సై



కాంగ్రెస్ శ్రేణులను నిలువరించిన సీఐ

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

తానూరు: మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన జంకోల్ల గంగాధర్ అనుమానాస్పదంగా మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగాధర్ (50) ఈనెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. శివారు ప్రాంతంలోని వ్యవసాయ బావిలో ఆదివారం శవమై కనిపించాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అక్కడి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గంగాధర్ కుమారుడు అనిల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోలో నుంచి జారిపడి ఒకరి మృతి

భైంసారూరల్: ఆటోలో నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కుభీర్ మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన భోజారాం (55) సోమవారం భైంసాకు వచ్చాడు. పనులు చేసుకుని తిరుగుప్రయాణంలో ఆటో ఎక్కాడు. మిర్జాపూర్ సమీపంలోకి చేరుకోగానే ఆటోలో నుంచి జారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆసుపత్రికి తరలివచ్చారు.

పండగపూట విషాదం

- విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి
- పెంబిలో ఘటన

పెంబి: దీపావళి రోజున విషాదం నెలకొంది. మొక్కజొన్న పంటకు నీళ్లు పట్టేందుకు వెళ్లిన యువకుడు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పెంబి మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..మండల కేంద్రానికి చెందిన ఈర్ల పోసాని–నర్సయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈర్ల రంజిత్ (23) దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండునెలల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. పెళ్లి నిశ్చయమైంది. త్వరలో పెళ్లి జరగాల్సి ఉంది. గ్రామ సమీపంలో తన తండ్రికి ఉన్న మొక్కజొన్న పంటకు నీళ్లు పట్టేందుకు ఆదివారం ఉదయం 6 గంటలకు వెళ్లాడు. ఉదయం 10 గంటల అవుతున్నా ఇంటికి రాలేదు. తండ్రి అక్కడికి వెళ్లి చూడగా.. విద్యుత్ మోటర్ వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. పెళ్లిపీటలపై ఎక్కాల్సిన కొడుకు కానరానిలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు.



ఈర్ల రంజిత్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు కాంపెల్లి విద్యాసాగర్(32) మృతిచెందాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం..విద్యాసాగర్ బైక్‌పై వేగంగా ఇచ్చోడ నుంచి సొనాలకు వస్తుండగా శివాజీచౌక్ వద్ద ఆటోను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలైన అతన్ని స్థానికులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.